క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి

కడప వైఎస్సార్ సర్కిల్: సికింద్రాబాద్ పార్లమెంటుకు సంబంధించిన ఖైరతాబాద్, బంజారాహిల్స్, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో–ఆర్డినేటర్‌గా విజయ్ సుశీల్‌కుమార్‌ను నియమించామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిలు రామయ్య, మమత నాగిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విజయ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించారని.. కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని వివరించారు.

29న ఆశీర్వాద కూడిక

కడప కల్చరల్ : రెడీమర్ చర్చి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థుల ఆశీర్వాద కూడిక నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాగరాజుపేటలోని స్టార్ ఫంక్షన్ హాలులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో ప్రముఖ వాక్య పరిచర్యకులు డాక్టర్ సుధీర్ దైవ సందేశం ఇవ్వనున్నారు.

పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రామచంద్రయ్య

కడప కార్పొరేషన్ : కడప నగరం సీయోనుపురంలోని కడ్డీల బడిలో చదువుతున్న పేద విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు రామచంద్రయ్య నోటు పుస్తకాలు, పెన్సిల్ కిట్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డుకాకూడదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



విద్యుత్ శాఖాధికారికి వినతిపత్రమిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌చార్జీలను తగ్గించాలని పీసీసీ కార్యదర్శి ఎస్‌ఏ అబ్దుల్ సత్తార్, ఏఐసీసీ కార్యదర్శి బండి జకరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంత వరకూ విద్యుత్ చార్జీలు పెంచబోమని చెబుతూ మొదటి సంతకం విద్యుత్ ఫైల్‌పై పెట్టి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఆయన అధికారంలో ఉన్నంత కాలం చార్జీలు పెంచలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సర్దుబాటు పేరిట చార్జీలు పెంచడం సరికాదన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఉన్నతాధికారికి వినతి పత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అవ్వారు మల్లికార్జున, దస్తగిరి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మధు, గొర్లె శ్రీనివాసులు, శ్యామలాదేవి, ప్రసాద్, అష్రఫ్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ఆర్జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాల పాఠశాలల్లో ఫీజుల కట్టడి చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్య ఆర్జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఆర్జేడీ వెంకట క్రిష్టారెడ్డిని కలిసి వినతిపత్రమిచ్చారు. పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్, అశోక్, చరణ్, సమద్ తదితరులు పాల్గొన్నారు.

డీవీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో అధిక ఫీజుల వసూలు చేస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కడప విభాగ కన్వీనర్ మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం ఇంటర్ డీవీఈఓ శ్రీనివాసులరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతి పత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు హరి,రాజు, మనోజ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపులపై చర్యలు తీసుకోండి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల జీతాలు ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్య ఆర్జేడీ వెంకట క్రిష్టారెడ్డిని కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు సుబ్బారెడ్డి, వీరనారాయణ, పార్థసారథి, నాగరాజు, కరీముల్లా పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాలబాటలో నడిపిద్దాం





సమావేశంలో పాల్గొన్న ఆర్‌ఎంలు, అద్దె బస్సుల యజమానులు, మాట్లాడుతున్న ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు

ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అద్దె బస్సుల యజమానులు బస్సుల రాకపోకల్లో సమయపాలన పాటించేలా చూడాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం తన కార్యాలయంలో అద్దె బస్సుల యజమానులతో, ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈడీ మాట్లాడారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, అందుకు తమవంతు బాధ్యతగా అందరం కృషి చేయాలన్నారు. అలాగే సిబ్బంది ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా చూడాలని ఆయన సూచించారు. బస్సులు ఎలాంటి మరమ్మతులకు కాకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ బస్సుల్లో పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. అందరి సహకారంతోనే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. అనంతరం అద్దె బస్సుల యజమానుల సమస్యలను ఆలకించిన ఈడీ సానుకూలంగా స్పందిస్తూ వాటిని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంలు గోపాల్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, సుమంత్ ఆర్ ఆదోని, టీవీ రామం, శ్రీనివాసులు, మధుసూదన్, రాము, జితేంద్రనాథ్‌రెడ్డితోపాటు ఇతర అధికారులు, అద్దె బస్సుల యజమానులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పూర్ణాహుతి : శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో జులై 3న బ్రహ్మయజ్ఞ మహాపూర్ణాహుతి నిర్వహించనున్నారు. ఆషాఢ పౌర్ణమి నాడు ఉదయం 4 గంటలకు అమ్మవారికి 25 ప్రత్యేక కళాశాలలో పవిత్ర నదుల నుంచి సేకరించిన జలాలతో అభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు శ్రీ విజయదుర్గాదేవి దీక్షలో ఉన్న భక్తులు దీక్ష విరమణ చేయనున్నారు. మధ్యాహ్నం ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించే బ్రహ్మయజ్ఞం మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు



మాట్లాడుతున్న కార్పొరేటర్ మహమ్మద్ ఆరీఫ్

కడప కార్పొరేషన్ : పేదా, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నదే సీఎం లక్ష్యమని.. అందుకే అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాలు అమలు చేస్తున్నారని 27వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ఆరీఫ్ అన్నారు. మంగళవారం స్థానిక గౌస్ నగర్ మున్సిపల్ పాఠశాలలో అమ్మ ఒడి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని.. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కాగా ఇంకా ఈకేవైసీ చేయించుకోని వారెవరైనా ఉంటే త్వరగా పూర్తి చేయించుకోవాలని సూచించారు. హెచ్‌ఎం తహియా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాదర్, అలీ, మహబూబ్ బాషా, ఖాదర్ హుస్సేన్ పాల్గొన్నారు.

పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండాలి

వైవీయూ : పరిశోధకులు, విద్యార్థులకు ఉపయుక్తమయ్యేలా విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ఉండాలని వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యతో కలిసి బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, జంతుశాస్త్ర శాఖలకు సంబంధించిన వెబ్‌సైట్‌ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల ప్రగతి, పరిశోధనల సమాచారం, జర్నల్స్ గురించి ఎప్పటికప్పుడు ఆధునీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తరగతులను తనిఖీ చేసిన వీసీ..

విశ్వవిద్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ (బయోటెక్నాలజీ, ఎర్త్‌సైన్స్) సెకండ్ సెమిస్టర్ తరగతులను వీసీ ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ రెగ్యులర్‌గా నిర్ణీత సమయానికి క్లాసులకు రావడం, సందేహాలు నివృత్తి చేసుకుంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న అఫ్జల్‌ఖాన్

కడప స్పోర్ట్స్ : కడప నగరం మున్సిపల్ హైస్కూల్ (ఉర్దూ) మైదానంలో తైక్వాండో శిక్షకుడు జంషీర్ వద్ద శిక్షణ పొందుతున్న క్రీడాకారులు జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్ మంగళవారం అభినందించారు. ఈనెల 25న రైల్వేకోడూరులో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో కడప నగరానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు పతకాలు సాధించినట్లు శిక్షకుడు జంషీర్ తెలిపారు. ఖుషీ మహమ్మద్, ఎస్.అబ్దుల్ రెహమాన్(స్వర్ణ పతకాలు), ఎం. గంగామయి, ఎస్. అఫ్జల్‌బాషా, ఎస్.హలీమాసాదియ (రజత పతకాలు), ఎస్. ఉమర్‌అబ్దుల్లా , ఎస్. అఫాన్ (కాంస్యపతకాలు) సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం జిల్లా క్రీడాకారులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జిల్లా ఉపాధి కల్పనాధికారికి సన్మానం



సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఏపీ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు సురేష్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్‌ను మంగళవారం ఏపీ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు ఇల్లూరు సురేష్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సన్మానించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్‌ను వారు మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలను తెలియజేశారు. అనంతరం సురేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగుల కోసం ప్రతినెల జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే స్కిల్‌డెవలప్‌మెంట్ ద్వారా కూడా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేశామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ సంఘం నగర అధ్యక్షులు సంజీవయ్య, న్యాయవాది ఓబులేశు, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షురాలు విమల, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీమకే గర్వకారణం డీకే చదువుల బాబు



డీకే చదువుల బాబును సన్మానిస్తున్న వెంకటయ్య తదితరులు

కమలాపురం: సుప్రసిద్ధ బాలసాహితీవేత్త డీకే చదువుల బాబుకు 2023కి గాను బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం రాయలసీమకే గర్వకారణం అని అధికార భాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని పెద్దచెప్పలి హైస్కూల్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో హెచ్‌ఎం ఓబులరెడ్డి అధ్యక్షతన చదువుల బాబును ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ మొట్టమొదటి సారి రాయలసీమకు బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం రావడం గర్వకారణం అన్నారు.ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన చదువుల బాబుకు అలాగే జిలానీ బాషాకు కూడా సాహిత్య విమర్శకు సంబంధించి కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారం రావడం జిల్లా సాహితీ మిత్రులందరికి దక్కిన గౌరవం అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓబుల్‌రెడ్డి, జీవీ సాయిప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యస్తున్న విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మకమైన విద్య అందుతుందని కడప ఎంఈఓ–2 ఇర్షాద్ ఆహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని బిస్మిల్లా నగర్ ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ అన్ని రకాల చర్యలను చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు, లాంటి పథకాలను అములు చేస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాధిక్ అలీ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పీఎంసీ కమిటి చైర్మెన్ సుల్తానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో హాస్టల్ విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హాస్టల్స్‌లో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు లేవన్నారు. జిల్లాలో కొన్ని హాస్టల్స్‌కు రెగ్యులర్ వార్డన్ లేరన్నారు. దీంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదన్నారు. అధికారులు స్పందించి హాస్టల్స్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్‌ఎస్‌యూ నాయకులు హరి, సాంబ, కిరణ్ హాస్టర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలన ఆదర్శం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ పాలన ఆదర్శనీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ లక్ష్మినారాయణరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కడప పార్లమెంటు కన్వీనర్ బాలకృష్ణయాదవ్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని 47, 48 డివిజన్లు అక్కాయపల్లె పరిసర ప్రాంతాల్లో మోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలనపై ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబిక, లక్ష్మణ్‌రావు, కల్యాణ్‌బాబు, వెంకటేశ్వర్లు, వెంకట కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, చలపతి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని టి.చదిపిరాళ్లలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకేల ప్రారంభోత్సవానికి బుధవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

వీరపునాయునిపల్లె : మండలంలో బసిరెడ్డిపల్లె, వెల్లుర్తి గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేసేందుకు బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజులరెడ్డిలు రానున్నారని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

పాత కలెక్టరేట్‌ను పునరుద్ధరించాలని వినతి

కడప కల్చరల్ : కడప నగరంలోని పాత కలెక్టరేట్ భవనాన్ని పునరుద్ధరించాలని భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ కన్వీనర్ చిన్నపరెడ్డి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కోరారు. మంగళవారం పులివెందులలో ఆయన్ను కలిశారు. జిల్లాకే గర్వకారణంగా నిలిచిన పాత కలెక్టరేట్ భవనాన్ని పునరుద్ధరించాలని, అందులో డాక్టర్ వైఎస్సార్ జ్ఞాపకార్థం మ్యూజియంను ఏర్పాటు చేయాలని, పాత మ్యూజియంను అక్కడికి తరలించాని కోరారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఇంటాక్ కార్యాలయ కార్యదర్శి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పూర్వ అధ్యక్షులు లయన్ జోజిరెడ్డి, లయన్ కొండారెడ్డిలు పాల్గొన్నారు.

విద్యార్థినికి న్యాయం చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌ఆర్‌ఐటీ కాలేజీలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థినికి కళాశాల యాజమాన్యం న్యాయం చేయాలని జిల్లాలోని పలు విద్యా సంఘాలు డిమాండ్ చేశాయి. కాలేజీ యాజమా న్యాల నిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని.. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేసి బాధితురాలికి న్యాయం చేయాలని కోరాయి.

నేమ్ బోర్డుల్లో ఉర్దూ భాషను చేర్చాలి



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతి పత్రం సమర్పిస్తున్న మైనార్టీ నాయకులు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీధుల్లో ఏర్పాటు చేస్తున్న నేమ్ బోర్డుల్లో తెలుగు, ఇంగ్లీషుతోపాటు ఉర్దూ భాషలో కూడా పేర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా, అలీ అక్బర్, మైనార్టీ బ్యాక్‌వర్డ్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు సలీంబాషా, ఐహెచ్‌ఆర్‌పీసీ దక్షిణ భారత సలహాదారు ఖాలిక్ ఖాన్ కోరారు. మంగళవారం వారు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ భాషను రెండవ అధికార భాషగా ప్రభుత్వం గుర్తించినప్పటికీ చాలా నేమ్ బోర్డుల్లో ఉర్దూలో రాయడం లేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు, ఆర్టీసీ బస్సుల బోర్డుల్లో కూడా ఉర్దూను చేర్చాలన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఉర్దూ డీఐ పోస్టులను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్తార్‌ఫైజీ అన్నారు. ఈ విషయమై మంగళవారం డిప్యూటీ సీఎం అంజాద్ బాషను కడపలోని తమ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉమ్మడిజిల్లాల్లో ఉర్దూ డీఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆదే విధంగా కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు ఉర్దూ డీఐ పోస్టులను మంజూరు చేస్తూ భర్తీ చేయాలన్నారు. డైరీ కమిటి చైర్మెన్ అబ్దుల్ హకీమ్, కో చైర్మెన్ సయ్యద్ సిరాజుద్దీన్, సోసియ్ మీడియా రష్ట్ర కన్వీనర్ అఫ్జల్‌బాష తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ నియామకంపై వివాదం

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని కుప్పూరువారిపల్లె ఎంపీపీ పాఠశాలలో స్వీపర్ నియామకంపై వివాదం చోటు చేసుకుంది. స్థానికులు, అధికారుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ పాఠశాలలో గత కొన్నేళ్లుగా మాధవి అనే మహిళ ఆయాగా పని చేస్తోంది. అయితే ఇటీవల ఆమె పాఠశాలలో లేని కారణంగా కొత్త ఆయాను నియమించాలని మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. 22 మంది విద్యార్థులు ఉండగా 11 మంది తల్లిదండ్రులు సమావేశానికి వచ్చారు. వారంతా కొత్త ఆయాగా నియమితులవుతున్న లక్ష్మీదేవికి మద్దతు ఇవ్వడంతో ఆమెనే ఆయాగా హెచ్‌ఎం శ్రీనివాసులు ఎంపిక చేశారు. ఈ విషయం తెలుసుకున్న పాత ఆయా మాధవి తన మద్దతు దారులతో అక్కడికి చేరుకుని ఎవరికి సమాచారం ఇవ్వకుండా కొత్త ఆయాను ఎలా నియమిస్తారని వాగ్వివాదానికి దిగింది. దీంతో పాఠశాల వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చిన్నపెద్దయ్య అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపించి వేశారు. కాగా మాధవి మద్దతు దారులు ఎంఆర్‌సీకి చేరుకుని ఆయా నియామకం సరైన పద్ధతిలో ఎంపిక చేయలేదని మరోసారి ఎంపిక చేయాలని ఎంఈఓ–2 సుభాషిణికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఎంఈఓ జాఫర్‌సాదిక్‌ను వివరణ కోరగా మాధవి మద్దతు దారులు ఇచ్చిన వినతి పత్రాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

సాఫ్ట్‌టెన్నిస్ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారిణులను అభినందిస్తున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ అమృత్‌రాజ్

కడప స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరచడంపై స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ అభినందించారు. ఈనెల 24, 25 తేదీల్లో అనంతపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కడప బాలికల జట్టు రెండోస్థానంలో నిలవడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే సింగిల్స్ బాలికల విభాగంలో మూడో స్థానంలో నిలిచిన ఎం.గ్రిహితను అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎగువపల్లెలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రంపతాడు గ్రామ సచివాలయం పరిధిలోని ఎగువపల్లె, రంపతాడు, జగంరెడ్డిపల్లె, కొత్తపల్లె, మమ్మసిద్దుపల్లె గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలిసి నిర్వహించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాడన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే అక్కడే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల సక్రమంగా అందుతున్నాయాలేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకుని సత్వరం వాటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ఎగువపల్లె, జగంరెడ్డిపల్లె గ్రామాల్లో సీసీరోడ్లు, విద్యుత్ లైన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు.అలాగే జగంరెడ్డి గ్రామంలో పాడుబడ్డ బావులను పూడ్చివేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, విజయ, వెంకటసుబ్బారెడ్డి, వినోద్ కుమార్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సర్పంచ్ సంజీవ్, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘జగనన్న సురక్ష’



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి

కమలాపురం : దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఏపీపీఎస్‌సీ బోర్డు మెంబర్ నిమ్మకాలయ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కమలాపురం వార్డు–1 సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి లబ్ధిదారులతో మాట్లాడారు. మీకు అర్హత ఉండి ఏవైన పథకాలు రానివి ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హత ఉండి పథకాలు రానివారికి ఆగస్టు 1వ తేదీ నుంచి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అలాగే మాకు అన్ని పథకాలు వస్తున్నాయి... ఏమీ పెండింగ్ లేవు అనే వారితో సైతం సంతకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందని వారుంటే గుర్తించి వారికి పథకాలు అందించడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నిఖిల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు అంబటి సురేష్, విశ్వనాథ రెడ్డి, మోనార్క్, సుదర్శన్‌రెడ్డి, కుమార్, ఖాజాపీర్, షారుక్ ఖాన్, స్థానిక నాయకులు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా ప్రారంభించిన జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అనిమెల, మొయిళ్ల చెరువు సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అవగాహనా కార్యక్రమం నిర్వమించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యే వారికి మరిన్ని సేవలు అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, జగనన్న సురక్ష పథకం మండల పరిశీలకుడు ఇదయత్, అనిమెల, మొయిళ్లచెరువు సర్పంచ్‌లు నరేష్ రెడ్డి, వెంకటరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంధుల ఆరాధ్యదైవం హెలెన్‌కెల్లర్



హెలెన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

కడప ఎడ్యుకేషన్ : అంధుల ఆరాధ్యదైవం హెలెన్‌కెల్లర్ అని హెలెన్ కెల్లర్ సంస్థల జనరల్ సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ డాక్టర్ దౌలత్‌ఖాన్, ప్రిన్సిపాల్ కం కో–ఆర్డినేటర్ మసుదాబేగం అన్నారు. హెలెన్ కెల్లర్ జయంతిని మంగళవారం కడప నగర శివార్లలోని హెలెన్‌కెల్లర్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, బధిర విద్యార్థులు పాల్గొన్నారు.